సాక్షి శ్రీకాకుళం

గురువారం । 11 । సెప్టెంబర్ । 2025



భవితకు నిచ్చెన..!

వెల్డింగ్‌తో ఉపాధికి విస్తృత అవకాశాలు లభిస్తున్నాయి. జిల్లాలో 250 వరకు శిక్షణ సంస్థలు అందుబాటులో ఉన్నాయి.

- 8లో



నార్త్‌జోన్ టోర్నీలో బోణీ

నార్త్‌జోన్ క్రికెట్ టోర్నీలో శ్రీకాకుళం జట్టు తొలి విజయం నమోదు చేసింది. విజయనగరం వేదికగా పోటీలు జరుగుతున్నాయి.

- 8లో

దరఖాస్తుల ఆహ్వానం

ఎచ్చెర్ల : డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ విశ్వవిద్యాలయంలో సంస్కృతం అంశంగా ఆరు నెలల స్వల్ప కాలిక కోర్సులో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు వర్సిటీ రిజిస్ట్రార్ బి.అడ్డయ్య బుధవారం తెలిపారు. ఈ నెల 17 వరకు దరఖాస్తులు స్వీకరించి 18 నుంచి తరగతులు ప్రారంభిస్తామని చెప్పారు. డిగ్రీ పూర్తి చేసిన వారు అర్హులని, ఎటువంటి ఫీజులు చెల్లించాల్సిన అవసరం లేదన్నారు. కోర్సు పూర్తయ్యాక నామ మాత్రం ఫీజు మాత్రమే చెల్లించాల్సి ఉంటుందని చెప్పారు. మెటీరియల్ ఉచితంగా పొందవచ్చన్నారు.

న్యూస్‌రీల్

14న జిల్లా జూనియర్స్ కబడ్డీ జట్ల ఎంపిక

శ్రీకాకుళం న్యూకాలనీ: జిల్లాస్థాయి జూనియర్స్ బాలబాలికల కబడ్డీ జట్ల ఎంపికలను ఈ నెల 14న నిర్వహిస్తున్నట్టు జిల్లా కబడ్డీ సంఘ అధ్యక్షుడు నక్క కృష్ణారావు, ప్రధాన కార్యదర్శి సాదు ముసలినాయుడు బుధవారం తెలిపారు. జిల్లా కేంద్రంలోని శాంతినగర్‌కాలనీలో ఉన్న డీఎస్‌ఏ ఇండోర్ స్టేడియం సమీపంలో ఉదయం 9 గంటలకు ఎంపికలు మొదలవుతాయని చెప్పారు. 2006 జనవరి 1 తర్వాత జన్మించిన బాలబాలికలు, బాలురు 70 కేజీలు లోపు, బాలికలు 65 కేజీల్లోపు వయస్సు ఉండాలని స్పష్టం చేశారు. మ్యాట్‌పై జరిగే ఈ ఎంపికలకు క్రీడాకారులు షూ ధరించి హాజరుకావాలని కోరారు. ఎంపికైన జిల్లా జట్లను కృష్ణా జిల్లా విజయవాడ వేదికగా జరిగే రాష్ట్రస్థాయి జూనియర్స్ కబడ్డీ చాంపియన్‌షిప్-2025 పోటీలకు పంపిస్తామని తెలిపారు. పూర్తి వివరాలకు సంఘ కార్యనిర్వాహక కార్యదర్శి సాదు శ్రీనివాసరావు(9441914214)ను సంప్రదించాలని కోరారు.

మిస్సింగ్ కేసులపై ప్రత్యేక దృష్టి



సమీక్షలో మాట్లాడుతున్న ఎస్పీ మహేశ్వరరెడ్డి

శ్రీకాకుళం క్రైమ్ : గత రెండేళ్లుగా పెండింగ్‌లో ఉన్న మహిళల అదృశ్యం కేసులపై పోలీసు అధికారులు దృష్టి సారించాలని, సాంకేతిక, శక్తి బృందాలు, ఇతర ఆధారాలతో వారిని గుర్తించాలని ఎస్పీ కె.వి.మహేశ్వరరెడ్డి స్పష్టం చేశారు. బుధవారం జిల్లా పోలీసు కార్యాలయంలో డీఎస్పీలు, సీఐలు, ఎస్‌ఐలతో ఎస్పీ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఈ నెల 13న నిర్వహించే జాతీయ లోక్ అదాలత్‌లో ఎక్కువ కేసులు పరిష్కారమయ్యేలా ముందస్తు చర్యలు చేపట్టాలన్నారు. నాన్ బెయిల్‌బుల్ వారెంట్ల అమలు, హత్య కేసుల్లో పురోగతి సాధించాలన్నారు. ఇరువర్గాలు రాజీ అయ్యేందుకు అవకాశమున్న కుటుంబ, ఆస్తి వివాదాలు, చిన్న క్రిమినల్ కేసులు, ట్రాఫిక్, ఇతర కాంపౌండ్ కేసులను గుర్తించి లోక్ అదాలత్‌లో రాజీ అయ్యేలా చూడాలన్నారు. సమావేశంలో అదనపు ఎస్పీ కె.వి.రమణ, డీఎస్పీ సీహెచ్ వివేకానంద పాల్గొన్నారు.

నేడు డయల్ యువర్ ఆర్‌ఎం

శ్రీకాకుళం అర్బన్: ఏపీఎస్‌ఆర్టీసీ ఆధ్వర్యంలో గురువారం ఉదయం 11 నుంచి 12 గంటల మధ్య డయల్ యువర్ ఆర్‌ఎం కార్యక్రమం నిర్వహించనున్నట్లు జిల్లా ప్రజారవాణా అధికారి సీహెచ్ అప్పలనారాయణ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. స్త్రీశక్తి పథకం (మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం) అమలు తీరుపై కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ పథకంపై మహిళల సూచనలు, సలహాలు, సమస్యలను 9959225603 నంబరుకు ఫోన్ చేసి తెలియజేయాలని కోరారు.

'క్వాంటమ్'తో సమూల మార్పులు



వక్తలను సన్మానిస్తున్న వీసీ, అధ్యాపకులు

ఎచ్చెర్ల : క్వాంటమ్ అధ్యయనాలే నేటి వైజ్ఞానిక రంగంలో సమూల మార్పులకు ఊతమిస్తున్నాయని డాక్టర్ బీఆర్‌ఏయూ వైస్ చాన్సలర్ కె.ఆర్.రజనీ తెలిపారు. ఎచ్చెర్లలోని అంబేడ్కర్ వర్సిటీలో 'క్వాంటమ్ కంప్యూటింగ్' అనే అంశంపై ఫిజిక్స్ విభాగం నిర్వహిస్తున్న మూడు రోజుల ప్రత్యేక ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్‌ను బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ క్వాంటమ్ టెక్నాలజీతో నూతన ఆవిష్కరణలు, అవకాశాలు ఏర్పడతాయన్నారు. నాగార్జున వర్సిటీ పూర్వ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ సి.సంధ్య, ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ గ్యాడ్యుయేట్ స్టడీస్(బెంగుళూరు) ప్రొఫెసర్ డాక్టర్ ఎన్.రామ్‌కుమార్‌లు మాట్లాడుతూ గణిత, భౌతికశాస్త్రం, కంప్యూటర్ సైన్స్ సబ్జెక్టులతో పాటు పలు రంగాలకు క్వాంటమ్ కంప్యూటింగ్‌తో బహుళ ప్రయోజనాలు ఉంటాయన్నారు. పాశ్చాత్య దేశాల్లో ఇప్పటికే క్వాంటమ్ ఏఐ వంటివి వారి ప్రగతిలో కీలకంగా మారాయని చెప్పారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ బి.అడ్డయ్య, పూర్వ రిజిస్ట్రార్ పి.సుజాత, ప్రిన్సిపాల్స్ ఎస్.ఉదయభాస్కర్, సీహెచ్ రాజశేఖరరావు, ఫిజిక్స్ అధ్యాపకులు పి.శివప్రసాద్‌రెడ్డి, ఎం.సుబ్బారావు, ఎ.గణేష్ బాబు, సుష్మారెడ్డి పాల్గొన్నారు.

ఎరువుల కోసం ఆందోళన పడొద్దు

శ్రీకాకుళం పాతబస్టాండ్ : ఎరువుల కోసం రైతులు ఆందోళన చెందవద్దని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ స్పష్టం చేశారు. బుధవారం డయల్ యువర్ కలెక్టర్ కార్యక్రమం నిర్వహించి పలువురు రైతుల నుంచి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో డీఆర్‌ఎం వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.



మీడియా స్వేచ్ఛ హరించడమే..



సమాజంలో జరుగుతున్న అన్యాయాలు, అక్రమాలు, సంఘటనలను బయటకు తీసుకొచ్చేది మీడియా. ప్రభుత్వం, వ్యవస్థల్లో లోటుపాట్లను ప్రజలకు చూపిస్తుంటుంది. 24 గంటలూ ప్రభుత్వం, పార్టీలు, రాజకీయ నాయకులు, ఉద్యోగులు, వివిధ వ్యవస్థలు ఎలా నడుస్తున్నాయన్నది నిష్పక్షపాతంగా అందించడమే మీడియా పని. అలాంటి మీడియాపైనే దాడులు, కక్ష సాధింపు చర్యలు సరికాదు.

- బి.మల్లేశ్వరరావు, విశ్రాంత డీఈఓ

రాష్ట్రంలో దుర్మార్గ పాలన



ప్రజల హక్కులను కాపాడుతూ.. ప్రభుత్వం చేస్తున్న తప్పిదాలను ప్రజలకు తెలియజేస్తున్న మీడియా ప్రతినిధులపై అక్రమ కేసులు బనాయించడం సరికాదు. కూటమి ప్రభుత్వం చేస్తున్న తప్పిదాలను సాక్షి దినపత్రిక ద్వారా ప్రజలకు వివరిస్తుండటాన్ని అధికార పార్టీ నాయకులు తట్టుకోలేకపోతున్నారు. రాష్ట్రంలో రాక్షస పాలన కొనసాగుతోంది. దీనిలో భాగంగానే సాక్షి ఎడిటర్ ధనుంజయరెడ్డిపై అక్రమ కేసులు బనాయిస్తున్నారు. ప్రజలే కూటమి ప్రభుత్వానికి గుణపాఠం చెబుతారు.

- సింగుపురం మోహన్‌రావు, న్యాయవాది

కలహాల కాపురం నిధుల భోజనం!



అరసవల్లి:

జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయం వర్గ పోరుకు, అవినీతి అక్రమాలకు నిలయంగా మారిందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇప్పటికే అనేక అక్రమాలతో నిండిపోయిన ఈ కార్యాలయంలో గతంలో ఎన్నడూ లేనివిధంగా 'కీలక' స్థానాల్లో పని చేస్తున్న అధికారులు అక్రమంగా రూ.లక్షలాది నిధులు స్వాహా చేసేందుకు పథకాలు రచిస్తున్నట్లు సమాచారం. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కొందరు నేతల అండదండలతో అక్రమాల్లో దూసుకుపోతున్నారు. దీనికి తోడు సూపరింటెండెంట్, ఏఓ వంటి అధికారులు రెండు వర్గాలుగా విడిపోయి కార్యాలయంలో రచ్చరచ్చ చేస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఏళ్ల తరబడి తిష్ట వేసిన సీనియర్ ఉద్యోగులతో పాటు ఓ ముగ్గురు ప్రోగ్రాం ఆఫీసర్లు కూడా అవినీతి చర్యల్లో పాల్గొనడంతో జిల్లా కార్యాలయం అవినీతి అక్రమాలకు కేంద్ర బిందువుగా మారిపోయిందనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.



- డీఎంహెచ్‌వో కార్యాలయంలో వర్గపోరు
- ఉన్నతాధికారుల తీరుతో సామాన్య ఉద్యోగులకు ఇక్కట్లు
- ప్రోగ్రాంల 'బడ్జెట్' దోచేసేందుకు కీలక ఉద్యోగి ప్లాన్

వర్గపోరులో నలిగిపోతున్న ఉద్యోగులు..

జిల్లా వైద్యారోగ్య శాఖలో కీలకంగా పనిచేస్తున్న ఇద్దరు విభాగాధికారుల మధ్య కొంతకాలంగా విబేధాలు రచ్చకెక్కాయి. దీంతో వర్గాలుగా విడిపోయి పరిపాలనను గాలికొదిలేశారు. ఈ వ్యవహారాన్ని చక్కదిద్దాల్సిన కీలక అధికారి చోద్యం చూస్తున్నారనే విమర్శలున్నాయి. ఇదే క్రమంలో రెండు వర్గాల నుంచి తన వాటా తనకు సకాలంలో వచ్చేలా ఏర్పాట్లు చేసుకుంటున్నారని తెలుస్తోంది. దీంతో సామాన్య ఉద్యోగులు తమ సమస్యలు పరిష్కారం కాక అవస్థలు పడుతున్నారు. జిల్లాలోని 30 మండలాలతో పాటు ఉమ్మడి జిల్లాలో ఎనిమిది మండలాలకు చెందిన వైద్యశాఖ ఉద్యోగులు తమ సర్వీస్‌లకు సంబంధించిన సమస్యలను చెప్పుకుంటున్నా పట్టించుకునేవారే కరువయ్యారు. రెండు వర్గాల మధ్య ఉద్యోగులు నలిగిపోతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

ఉద్యోగికి మూడు మెమోలు..

తాజాగా లెప్రసీ, టీబీ నివారణ విభాగానికి చెందిన జూనియర్ అసిస్టెంట్ విజయసుందరిమణి (గీతాంజలి) అనే ఉద్యోగినికి ఏకంగా మూడు మెమోలు జారీ చేశారు. గీతాంజలిని వర్క్ అడ్జెస్ట్‌మెంట్‌లో భాగంగా స్థానిక సూపరింటెండెంట్ కార్యాలయంలో ఎస్టాబ్లిష్‌మెంట్ కీలక సెక్షన్‌ను అప్పగించారు. ఆమెకు రెండు నెలల క్రితమే సీనియర్ అసిస్టెంట్‌గా పదోన్నతి రావడంతో తిరిగి ఆమె టీబీ, లెప్రసీ విభాగానికి వెళ్లిపోయారు. అయితే ఎస్టాబ్లిష్‌మెంట్ సెక్షన్‌లో పాత ఫైళ్ల హ్యాండోవర్ విషయంలోనూ, తన పరిధిలో లేని అంశాలపైన, వ్యక్తిగత సెలవు విషయంలో టార్గెట్ చేస్తూ గీతాంజలికి వరుసగా మూడు మెమోలను జారీ చేయించారు. తనకు చార్జిమెమోతో ఉద్యోగంలో రిమార్క్ తెప్పించే ప్రయత్నాలు జరుగుతున్నట్టుగా బాధిత ఉద్యోగిని వాపోతోంది.

బడ్జెట్‌ను తినేసేందుకు కుట్ర!

జిల్లా వైద్యారోగ్య శాఖలో జిల్లా స్టాటిస్టికల్ ప్రోగ్రాం, డెమో, ఎన్‌హెచ్‌ఎం, ఇమ్యూనైజేషన్, ఆర్‌బీఎస్‌కే ప్రోగ్రాం, ఎన్‌సీడీ-ఐడీఎస్‌పీ, టీబీ లెప్రసీ తదితర ఏడు ప్రోగ్రాంలుండగా.. వీటిలో వార్షిక బడ్జెట్ కేటాయింపులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మంజూరు చేస్తుంటాయి. ఈ ఏడు ప్రోగ్రాంలను డీఎంహెచ్‌వో, డిప్యూటీ డీఎంహెచ్‌వోలే పర్యవేక్షించాల్సి ఉంటుంది. పలు ప్రోగ్రాంలలో ఇప్పటికే మిగిలి ఉన్న బడ్జెట్ సుమారు రూ.1.50 కోట్లకు పైగానే నిధులను వివిధ రకాల ఖర్చులను చూపించి స్వాహా చేసేలా కీలక అధికారి పన్నాగాలు సిద్ధం చేసినట్లు తెలిసింది. ఇందుకోసం వివిధ కారణాలతో ఖాళీగా ఉన్న ప్రోగ్రాం అధికారిగా జిల్లా కేంద్రంలో పనిచేసే అధికారికి కాకుండా నరసన్నపేట నియోజకవర్గంలో పనిచేస్తున్న ఓ వైద్యాధికారికి అప్పగించారు. ప్రోగ్రాం బడ్జెట్‌లో ఉన్న సుమారు రూ.20 లక్షలను ఈ నెలలో ఖర్చు చేసేసినట్లు చూపించేలా ప్రణాళికలు సిద్ధం చేసినట్లు సమాచారం. బయట ప్రాంతం నుంచి అధికారిని నియమించడంతోనే కీలక అధికారి కుట్ర బయటపడిందని వైద్యశాఖ ఉద్యోగులు చర్చించుకుంటున్నారు. ఈ నెలలో కలెక్టర్ స్వప్నిల్ దినకర్ ఈ ఏడు ప్రాజెక్టుల బడ్జెట్‌లపై సమీక్ష నిర్వహించే సమయంలోనే ఈ కుట్రకు తెరలేపినట్లు తెలుస్తోంది. ఈ వ్యవహారంలో కీలక అధికారి అంతా తానై వ్యవహరించినట్లు సమాచారం. త్వరలో బదిలీలు జరిగే అవకాశాలున్నందున కీలక అధికారి దృష్టంతా బడ్జెట్‌లపైనే పడిందనే చర్చ శాఖలో జోరందుకుంది.

చేయి తడిపితేనే పనులు..



జిల్లా వైద్యారోగ్య శాఖలో ఇటీవల జిల్లా వైద్యారోగ్య శాఖాధికారిగా పని చేసిన బాలమురళీ కృష్ణ నేరుగా లంచం తీసుకుంటూ ఏసీబీకి చిక్కిన సంగతి విదితమే. ఈ ఘటన తర్వాత డీఎంహెచ్‌వో కార్యాలయంలో అంతా సవ్యంగా ఉంటుందని భావించినప్పటికీ.. మళ్లీ యథావిధిగా లంచాల జోరు పెరిగింది. తాజాగా జరిగిన ఏఎన్‌ఎంల బదిలీల్లో రూ.లక్షల్లో చేతులు మారిన సంగతి విదితమే. తాజాగా వర్గ పోరులతో సామాన్య ఉద్యోగుల సమస్యలు పెండింగ్‌లో ఉండిపోతున్నాయి. సర్వీస్ రెగ్యులైజేషన్, సరెండర్ లీవులు, మెడికల్ లీవులు, స్పెషల్ గ్రేడ్ ఇంక్రిమెంట్స్, చైల్డ్ కేర్ లీవులు, మూమెంట్ ఆర్డర్లు తదితర పనుల నిమిత్తం ఇక్కడికి జిల్లా నలుమూలల నుంచి నిత్యం ఉద్యోగులు తమ వినతులను ఇస్తుంటారు. నెలలు గడుస్తున్నా ఫైళ్లకు మోక్షం కలగడం లేదని వాపోతున్నారు. ప్రతి పనికి రూ.5 వేల నుంచి డబ్బులు వసూళ్లు చేస్తున్నారని ఓ రెగ్యులైజేషన్ పెండింగ్ ఉన్న ఓ ఉద్యోగి 'సాక్షి' వద్ద ఆవేదన వ్యక్తం చేశారు. చాలా మంది సరెండర్ లీవుల పేరిట వస్తున్నప్పటికీ ఫైళ్లకు స్థానచలనం లేకుండా పెండింగ్‌లో ఉంచుతున్నారనే విమర్శలున్నాయి. చేతికి లంచం ఇస్తే.. వెంటనే పనులు అవుతున్నాయని పలువురు వాపోతున్నారు. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు ఈ శాఖ పనితీరుపై ప్రత్యేక దృష్టి సారించాలని పలువురు కోరుతున్నారు.

నేపాల్ సమాచారం కోసం హెల్ప్‌లైన్

శ్రీకాకుళం పాతబస్టాండ్: నేపాల్‌లో నెలకొన్న అశాంతి పరిస్థితుల నేపథ్యంలో అక్కడ చిక్కుకున్న తెలుగు ప్రజలకు తక్షణ సహాయం అందించేందుకు కలెక్టర్ కార్యాలయంలో అత్యవసర హెల్ప్‌లైన్‌ను కలెక్టర్ స్వప్నిల్ దిన్కర్ పుండ్కర్ ఏర్పాటు చేశారు. 9491222122 నంబరుకు ఫోన్ చేసి సహాయం పొందవచ్చు. దీనిని పర్యవేక్షించేందుకు ముగ్గురు ఉన్నతాధికారులతో ప్రత్యేక బృందాన్ని నియమించారు. పారిశ్రామిక ప్రోత్సాహక అధికారి కిరణ్ (9949478989), సీనియర్ సహాయకులు ఎల్.రాజ్యలక్ష్మి (9441022669), సహాయ జిల్లా సమాచార అధికారి బి.విజయ్‌బాబు (9110769608) బృందం హెల్ప్‌లైన్‌కు వచ్చే ప్రతి కాల్‌ను స్వీకరించి వివరాలు నమోదు చేసుకుంటుంది. సమాచారాన్ని జిల్లా యంత్రాంగానికి, ఢిల్లీలోని ఆంధ్రప్రదేశ్ భవన్‌కు చేరవేసి సహాయ చర్యలు వేగవంతం చేసేందుకు చర్యలు చేపడుతుంది.

థర్మల్ ప్లాంట్ సర్వే అడ్డగింత



సర్వే బృందాన్ని అడ్డుకున్న ఆదివాసీలు

బూర్జ: ఆదివాసీల జీవితాలతో పాటు పర్యావరణాన్ని నాశనం చేసే క్రిటికల్ సూపర్ థర్మల్ పవర్ ప్లాంట్ నిర్మాణాన్ని తమ ప్రాంతంలో చేపట్టవద్దంటూ ఆదివాసీలు నినాదాలు చేశారు. బుధవారం బూర్జ, సరుబుజ్జిలి మండలాల్లోని జేవీ పురం, తిమడాం, జంగాలవలస, బొడ్లపాడు, వెన్నెలవలస గ్రామాల ఆదివాసీలు మూకుమ్మడిగా వచ్చి తిమడాం వద్ద సర్వే బృందాలను అడ్డుకున్నారు. సర్వే చేపట్టవద్దంటూ వారి వద్ద మెటీరియల్ తీసుకున్నారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి వచ్చి ఆదివాసీలకు నచ్చజెప్పి మెటీరియల్‌ను తీసుకుని సిబ్బందికి అందజేశారు. ఈసందర్భంగా ఆదివాసీలు మాట్లాడుతూ ప్రాణత్యాగం చేసైనా ప్లాంట్ నిర్మాణం అడ్డుకుంటామని స్పష్టం చేశారు.

హా..స్టళ్లు..!

- పాడుబడిన భవనాలతో అవస్థలు
- కురిగాం, కొత్తూరు వసతి గృహాల్లో చేరని విద్యార్థులు



కొత్తూరులో శిథిలావస్థకు చేరిన ఎస్సీ బాలికల వసతి గృహం

కొత్తూరు: విద్యార్థుల సంక్షేమానికి చర్యలు తీసుకుంటున్నామని చెబుతున్న కూటమి ప్రభుత్వ ప్రకటనలకు.. క్షేత్రస్థాయిలో పరిస్థితులకు పొంతన లేకుండా ఉంది. దీనికి నిదర్శనంగా కొత్తూరు మండలం కురిగాం గ్రామంలోని ఎస్సీ బాలుర వసతి గృహం, కొత్తూరులోని ఎస్సీ బాలికల వసతి గృహాలను చెప్పుకోవచ్చు. ఈ వసతి గృహాల్లో కనీస మౌలిక సదుపాయాలు లేకపోవడంతో విద్యార్థులు చేరేందుకు ఆసక్తి చూపించడం లేదు. ఈ ఏడాది వేసవి సెలవుల అనంతరం ఇప్పటివరకు ఈ వసతి గృహాల్లో విద్యార్థులు చేరలేదు. దీంతో ఖాళీ భవనాలు దర్శనమిస్తున్నాయి.

భయపెడుతున్న శిథిల భవనాలు

కొత్తూరు ఎస్సీ బాలికల వసతి గృహం బాగా పాతబడిపోవడంతో విద్యార్థులు వసతి గృహంలో ఉండేందుకు భయపడుతున్నారు. వర్షాలు వచ్చే సమయంలో ఈ వసతి గృహం ముందు ఉన్న రోడ్డు మీదకు నీరు చేరి విద్యార్థులు అవస్థలు పడుతున్నారు. వసతి గృహానికి వెళ్లే రహదారి సైతం అధ్వానంగా ఉంది. అలాగే పరిసరాలు అపరిశుభ్రంగా ఉండడం వలన వసతి గృహానికి వచ్చేందుకు విద్యార్థులు ఇష్టపడడం లేదు. అదేవిధంగా కురిగాం వసతి గృహం గదులు బీటలువారి ప్రమాదపుటంచున ఉన్నాయి. ఇక్కడ గదులకు తలుపులు లేవు. వర్షం వస్తే నీరు కారుతోంది. దీంతో ఇటువంటి ప్రమాదకర పరిస్థితుల్లో విద్యార్థులను చేర్పించేందుకు తల్లిదండ్రులు భయపడుతున్నారు. ఫలితంగా రెండు వసతి గృహాల్లో ప్రస్తుతం విద్యార్థులు చేరలేదు. గత విద్యా సంవత్సరంలో కొత్తూరు ఎస్సీ బాలికలు వసతి గృహంలో 18 మంది విద్యార్థులు ఉండేవారు. అయితే వేసవి సెలవుల అనంతరం విద్యార్థులు రాకపోవడంతో వసతి గృహానికి తాళం వేశారు. కురిగాం వసతి గృహంలో గత విద్యా సంవత్సరంలో 11 మంది విద్యార్థులు ఉండేవారు. సెలవులు తర్వాత విద్యార్థులు మరెవ్వరూ రాలేదు. ఫలితంగా ప్రభుత్వ నిర్వాకం కారణంగా ఈ రెండు వసతి గృహాలు మూతపడే ప్రమాదం ఉంది. ప్రస్తుతం ఈ రెండు వసతి గృహాల్లో నాల్గో తరగతి సిబ్బంది ఒక్కక్కొరు పనిచేస్తున్నారు.



అధ్వానంగా కురిగాం హాస్టల్ తలుపులు

అవగాహన కల్పిస్తున్నాం

కొత్తూరు, కురిగాం ఎస్సీ బాలికల, బాలుర వసతి గృహాల్లో విద్యార్థులను చేర్పించేందుకు తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని వార్డెన్లకు ఆదేశించాము. ఇప్పటికే వార్డెన్లు గ్రామాల్లోకి వెళ్లి అవగాహన కల్పిస్తున్నారు. కురిగాంలో భవనాలు పాడవ్వడంతో వసతి గృహంలో చేరేందుకు ఎవరూ ఇష్టపడడం లేదు. అలాగే కొత్తూరులో వార్డెన్ లేకపోవడంతో పక్కన ఉన్న వార్డెన్‌కు ఎఫ్‌ఏసీ ఇవ్వడం వలన అడ్మిషన్లపై దృష్టి సారించలేకపోయారు. విద్యార్థులు వచ్చినట్లయితే వసతి గృహాల్లో చేర్పించుకుంటాము.

– శ్యామల, ఏఎస్‌డబ్ల్యూ, పాతపట్నం

ఆసనాలు అదరహో..



పలాస ప్రభుత్వ ఉన్నత పాఠశాల క్రీడామైదానంలో బుధవారం నిర్వహించిన పాఠశాల క్రీడా పోటీలు ఆద్యంతం ఉత్సాహంగా సాగాయి. యోగా పోటీలకు వివిధ పాఠశాలల నుంచి విద్యార్థులు తరలివచ్చి అద్భుత యోగ విన్యాసాలతో ఆకట్టుకున్నారు. - పలాస

అసంఘటిత కార్మికుల నమోదుకు స్పెషల్ డ్రైవ్

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ) : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలతో అసంఘటిత కార్మికుల నమోదుకు ఈ నెల 15 వరకు స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నామని కార్మిక శాఖ ఉప కమిషనర్ కె.దినేష్‌కుమార్ తెలిపారు. ఈ మేరకు బుధవారం కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఉత్తర్వులు జారీ చేశారని పేర్కొన్నారు. 18 నుంచి 60 ఏళ్ల లోపు కార్మికులు అర్హులని, పీఎఫ్/ఈఎస్ఐ సభ్యత్వం ఉన్నవారు అనర్హులని, రిజిస్టర్ అయిన వెంటనే గుర్తింపుకార్డు వస్తుందని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం అసంఘటిత కార్మికులకు ఇచ్చే ప్రయోజనాలన్నీ లభిస్తాయన్నారు. సందేహాలుంటే జిల్లా కార్మిక శాఖ హెల్ప్‌లైన్ 6302438760కు ఫోన్ చేసి వివరాలు పొందవచ్చన్నారు.

స్మార్ట్ దోపిడీ!

- స్మార్ట్ రేషన్‌కార్డులకు అథెంటికేషన్ పేరిట దందా
- కార్డుకు రూ.30 నుంచి రూ.50 వరకు వసూళ్లు



శ్రీకాకుళం పాతబస్టాండ్: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రజలకు లబ్ధి చేకూర్చే ఏ కార్యక్రమం చేపట్టినా అందులో ఏదో ఒక రూపంలో డబ్బు సంపాదించే మార్గాన్ని కొందరు టీడీపీ నాయకులు ఎంచుకుంటున్నారు. ఈ క్రమంలో ఇటీవల చేపట్టిన స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీలో కొందరు చేతివాటం ప్రదర్శిస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. పాత రేషన్ కార్డుల స్థానంలో క్యూఆర్ కోడ్‌తో కూడిన స్మార్ట్ కార్డులను ప్రభుత్వం ఇటీవల లబ్ధిదారులకు అందజేస్తున్న సంగతి తెలిసిందే. కార్డులను సచివాలయాలు సిబ్బంది, రేషన్‌షాప్ డీలర్ ద్వారా లబ్ధిదారులకు అందజేస్తున్నారు. ఈ సమయంలో కార్డు అథెంటికేషన్ చేయించుకోవాలి. దీనికి మూడు రకాల విధానాలను ప్రభుత్వం సూచించింది. ఫేషియల్ యాప్, ఓటీపీ, బయోమెట్రిక్ విధానాల్లో ఏదో ఒక విధానంలో వెరిఫై తప్పనిసరి చేసింది. ఈ సమయంలో లబ్ధిదారుల నుంచి ఒక్కొక్క కార్డుకు రూ.30 నుంచి రూ.50 వరకు వసూలు చేస్తున్నట్లు సమాచారం. ఈ దందా గ్రామీణ ప్రాంతాల కంటే పట్టణ ప్రాంతాల్లోనే ఎక్కువగా జరుగుతున్నట్టు తెలుస్తోంది.

ఇదీ పరిస్థితి..

జిల్లాలో 6,57,758 రేషన్ కార్డులు ఉన్నాయి. ఇప్పటివరకు 6,51,717 స్మార్ట్ కార్డులు విడుదల చేశారు. వీటి పంపిణీ గ్రామాల్లో ముమ్మరంగా జరుగుతుంది. అనేక చోట్ల డీలర్లు డబ్బులు తీసుకుంటున్నారని లబ్ధిదారులు ఆరోపిస్తున్నారు. ఈ విషయంలో డీలర్లకు టీడీపీ నాయకులకు మధ్య విభేదాలు సైతం తలెత్తుతున్నట్లు తెలిసింది. మరికొన్ని చోట్ల స్మార్ట్ కార్డు వసూళ్ల వెనుక డీలర్లతోపాటు స్థానిక కూటమి నాయకులు ఉన్నట్లు సమాచారం.

ఇద్దరు సచివాలయ ఉద్యోగుల సస్పెన్షన్

- యూరియా వివరాలు సక్రమంగా తెలియజేయకపోవడంపై కలెక్టర్ ఆగ్రహం



సిబ్బందిని హెచ్చరిస్తున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

కంచిలి: పంట సాగు విస్తీర్ణం నమోదులో రెవెన్యూ, వ్యవసాయశాఖ అధికారులు, సచివాలయ ఉద్యోగుల మధ్య సమన్వయలోపం తలెత్తడంతో కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. కంచిలి మండలం గోకర్ణపురం రైతు సేవా కేంద్రాన్ని కలెక్టర్ బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా అక్కడి రైతులు, అధికారులు, సచివాలయ ఉద్యోగులతో కలిసి గోకర్ణపురం, శాసనాం, వీరనారాయణపురం గ్రామాల్లో ఇంతవరకు సరఫరా చేసిన యూరియా, వాస్తవంగా అవసరమైన యూరియా వివరాలు తెలియజేయాలని రెండు శాఖల అధికారులను వేర్వేరుగా ప్రశ్నించారు. ఈ క్రమంలో వేర్వేరు నివేదికలు చెప్పిన వీఏఏ దిక్కల అన్వేష్, వీఆర్వో జి.వెంకటరమణలపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ సస్పెండ్ చేశారు. మండలస్థాయి అధికారుల పర్యవేక్షణ లేకపోవడంపై తహశీల్దార్ ఎన్.రమేష్‌కుమార్, మండల వ్యవసాయాధికారి కె.సురేష్‌లను మందలించారు. గోకర్ణపురం, శాసనాం సర్పంచ్‌లు యారడి ఆనందరావు, గుడ్డి పద్ర వేణులు స్థానిక రైతు ప్రతినిధులుగా వ్యవహరించి, ఇక్కడ ఏ మేరకు యూరియా అవసరం అనేది నివేదించడంతో.. త్వరలో 420 బస్తాల యూరియా పంపిస్తామని కలెక్టర్ చెప్పారు. అనంతరం గోకర్ణపురం ప్రాథమిక పాఠశాలను సందర్శించారు. కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి కె.అప్పలస్వామి, తహశీల్దార్ ఎన్.రమేష్‌కుమార్, వ్యవసాయ సహాయ సంచాలకులు టి.భవానీ శంకర్, ఎంపీడీఓ వి.తిరుమలరావు, మండల వ్యవసాయాధికారి కె.సురేష్, ఎంఈఓ ఎస్.శివరాంప్రసాద్, వీఆర్వోలు, వీఏఏలు పాల్గొన్నారు. కాగా, రైతులకు సక్రమంగా యూరియా అందకపోవడం వెనుక గల కారణాలను పక్కన పెట్టి అనవసరంగా ఉద్యోగులను సస్పెండ్ చేయడం ఏంటని అధికార వర్గాల్లో చర్చ జరుగుతోంది. మరోవైపు ఈ సస్పెన్షన్‌లను నిలుపుదల చేయాలని రాజకీయ ఒత్తిళ్లు మొదలైనట్లు తెలుస్తోంది.

క్లుప్తంగా

బీఆర్‌ఏయూ రిజిస్ట్రార్‌గా అడ్డయ్య



అడ్డయ్యకు నియామకపత్రాన్ని అందిస్తున్న వీసీ రజని

ఎచ్చెర్ల: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ యూనివర్సిటీ నూతన రిజిస్ట్రార్‌గా వర్సిటీ సీనియర్ అధ్యాపకుడు ఆచార్య బి.అడ్డయ్య నియమితులయ్యారు. ఈ మేరకు వర్సిటీ వీసీ ఆచార్య కె.ఆర్.రజని నియామక ఉత్తర్వులు బుధవారం అందజేశారు. ఇప్పటివరకు అడ్డయ్య వర్సిటీ రెక్టార్‌గా వ్యవహరించడమే కాకుండా, పలు మార్లు ఇన్‌చార్జి రిజిస్ట్రార్‌గా సేవలను అందించారు.

గ్యాస్ సిలిండర్ నుంచి మంటలు



ఇంటిని పరిశీలిస్తున్న అగ్నిమాపక సిబ్బంది

నరసన్నపేట: స్థానిక మెయిన్ రోడ్డులోని వేంకటేశ్వర థియేటర్ సమీపంలో ఉన్నటువంటి ఎం.పాపారావు ఇంట్లో పెను ప్రమాదం తప్పింది. ఉదయం పాపారావు భార్య కుమారి పాలు మరిగిస్తుండగా ఒక్కసారిగా సిలిండర్ నుంచి మంటలు వ్యాపించాయి. కొన్ని సెకన్లలోనే మంటలు ఎగసిపడ్డాయి. దీంతో కుమారి భయంతో బయటకు పరుగులు తీసింది. వెంటనే స్థానికులు వచ్చి తడి గోనె సంచులు కప్పి మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. సమాచారం తెలుసుకున్న స్థానిక అగ్నిమాపక సిబ్బంది సంఘటన స్థలానికి వచ్చి, పరిశీలించి తగు సూచనలు చేశారు. కాగా ఈ ప్రమాదంలో ఎటువంటి నష్టం జరగలేదు.

నార్త్‌జోన్ క్రికెట్ టోర్నీలో శ్రీకాకుళం బోణీ



అబ్దుల్ సమీర్ (112 నాటౌట్)



కె.సాయిసాత్విక్ (72 పరుగులు)



డీవీ శ్రీరామ్ (10 వికెట్ల హాల్)

శ్రీకాకుళం న్యూకాలనీ: ఏసీఏ నార్త్‌జోన్ అంతర్ జిల్లాల క్రికెట్ టోర్నీలో శ్రీకాకుళం జట్టు విజయంతో బోణీ కొట్టింది. జిల్లా బ్యాటర్ అబ్దుల్ సమీర్ 112 పరుగుల అజేయ సెంచరీతో, రైటార్మ్ ఆఫ్ స్పిన్నర్ డీవీ శ్రీరామ్ రెండు ఇన్నింగ్స్‌ల్లో కలిపి 10 వికెట్లతో విజృంభించడంతో ఆతిథ్య విజయనగరంతో సోమవారం నుంచి బుధవారం వరకు జరిగిన మల్టీడేస్ మ్యాచ్‌లో 6 వికెట్ల తేడాతో శ్రీకాకుళం ఘన విజయం సాధించింది. విజయనగరం జిల్లా వేదికగా ఏసీఏ నార్త్‌జోన్ అంతర్ జిల్లాల త్రీడేస్ (మల్టీడేస్) పురుషుల అండర్-23 క్రికెట్ టోర్నమెంట్ ఇటీవలే మొదలైంది. టోర్నీలో భాగంగా మొదటి మ్యాచ్‌లో ఆతిథ్య విజయనగరం, శ్రీకాకుళం జట్లు తలపడ్డాయి. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న విజయనగరం జట్టు తన మొదటి ఇన్నింగ్స్‌లో 249 పరుగులకు ఆలౌటైంది. అనంతరం మొదటి ఇన్నింగ్స్‌ను ప్రారంభించిన శ్రీకాకుళం జట్టు 148 పరుగుల వద్ద కుప్పకూలింది. 101 పరుగుల ఆధిక్యంతో తన రెండో ఇన్నింగ్స్‌ను ప్రారంభించిన విజయనగరం జట్టు 164 పరుగులకు ఆలౌట్ అయ్యింది. 266 పరుగుల విజయలక్ష్యంతో బరిలోకి దిగిన శ్రీకాకుళం జట్టు ధాటిగా బ్యాటింగ్‌చేసి 4 వికెట్లు కోల్పోయి విజయాన్ని అందుకుంది. తదుపరి తూర్పుగోదావరితో మ్యాచ్ జరగనుంది.

వెల్డింగ్ శిక్షణ.. భవితకు నిచ్చెన..!



వెల్డింగ్ చేసిన తర్వాత గ్రైండింగ్‌లో శిక్షణ పొందుతున్న యువకుడు

- వెల్డింగ్‌తో ఉపాధికి విస్తృత అవకాశాలు
- జిల్లాలో 250 వరకు శిక్షణ సంస్థలు
- విదేశాల్లో మంచి జీతాలు
- మోసపోవద్దని పోలీసుల సూచన

వజ్రపుకొత్తూరు: నేటి యువత అవకాశాలను అందిపుచ్చుకుంటున్నారు. సాఫ్ట్‌వేర్ కొలువులే కాకుండా వెల్డింగ్ రంగంపై కూడా ఆసక్తి పెంచుకుంటున్నారు. సాంప్రదాయ వెల్డింగ్‌తో పాటు హైటెక్ ఆటోమేటెడ్ పరికరాలను ఉపయోగించే పరిశ్రమలకు ఉపయోగపడే ప్రొఫెషనల్ వెల్డింగ్‌లోనూ నైపుణ్యం సాధిస్తున్నారు. వెల్డింగ్‌లో నూతన సాంకేతిక పరిజ్ఞానంతో సొంతంగా వెల్డింగ్ ఇనిస్టిట్యూట్, ఫ్యాబ్రికేషన్లను ప్రారంభించి మరికొందరికి ఉపాధి కల్పిస్తున్నారు. మరికొంతమంది విదేశాల బాట పడుతున్నారు. సాఫ్ట్‌వేర్ ఉద్యోగస్తులతో సమానంగా నెలకు రూ.1.50 లక్షల నుంచి రూ.2.50 లక్షల వరకు సంపాదిస్తున్నారు.

ఉత్తమ ఉపాధి అవకాశాలు

చేతిలో పని(స్కిల్) ఉంటే ఎలాంటి సంస్థలైనా ఉపాధి కల్పిస్తాయని తెలుసుకుని ఇప్పుడు శిక్షణ సంస్థలను ఆశ్రయిస్తున్నారు. ప్రతిభ ఉన్నవారికి ఉపాధి అవకాశాలు తలుపు తడుతున్నాయి. వెల్డింగ్, ఫిట్టర్, సేఫ్టీ రంగాల్లో మంచి ఉపాధి అవకాశాలు ఉన్నాయి. ఈ రంగాల్లో జీతం నెలకు రూ.3.50 లక్షల వరకు సంపాదించే యువత కూడా ఉద్దానం ప్రాంతంలో ఉన్నారు. రష్యా, ఇటలీ, జపాన్, పోలెండ్ ప్రాంతాల్లో ఉపాధి పొందుతున్నారు. దీంతో యువకులు ఈ కోర్సులపై మొగ్గు చూపుతున్నారు. రేపటి బంగారు భవిష్యత్‌కు బాటలు వేయడానికి శ్రీకాకుళం జిల్లాలోని ఇచ్ఛాపురం, కంచిలి, హరిపురం, పలాస, పూండి, నరసన్నపేట, శ్రీకాకుళం, రూరల్, అర్బన్ ప్రాంతాల్లో దాదాపు 250కి పైగా వెల్డింగ్ ఇనిస్టిట్యూట్లు నిరుద్యోగ యువతకు శిక్షణ ఇస్తున్నాయి. స్కిల్ ఉన్నవారిని పిలిచి మరీ ఉద్యోగాలు ఇస్తారని తెలుసుకుని యువకులు పోటీతత్వంతో ముందుకు సాగుతున్నారు. వీరికి వెల్డింగ్ రంగం గొడుగు పడుతోంది.



వెల్డింగ్‌లో శిక్షణ తీసుకుంటున్న యువకుడు



వెల్డింగ్ నేర్చుకుంటున్న యువకుడు

మోసపోతున్న యువత

కాగా విదేశీ ఉద్యోగాల మోజులో యువత కొంతమంది ఏజెంట్లు, మధ్యవర్తులను నమ్మి మోసపోతున్నారు. లక్షలాది రూపాయలను వారి చేతిలో పెట్టి టూరిస్టు వీసాలతో వెళ్లి అక్కడ నరకయాతన అనుభవిస్తున్నారు. గుర్తింపు పొందిన వెల్డింగ్ ఇనిస్టిట్యూట్ అసోసియేషన్లలో నమోదైన సంస్థల్లో మాత్రమే శిక్షణ తీసుకోవాలని పోలీసులు చెబుతున్నా యువత పెడచెవిన పెట్టి ఉద్దానం, తీర ప్రాంత గ్రామాల్లోని విదేశీ ఏజెంట్ల వలలో చిక్కిపోతున్నారు. నకిలీ వీసాలతో పాటు కంపెనీ కాంట్రాక్టు కాపీలు, జీతం, వసతి అలవెన్సులు తదితర విషయాల్లో సైతం మోసాలకు పాల్పడుతుండడంతో విదేశీ ఉద్యోగాల పేరుతో మోసపోయిన కుటుంబాలు ఆర్థికంగా చితికిపోతున్నాయి.

సర్టిఫైడ్ కోర్సులకు డిమాండ్

ఉన్నత విద్యను అభ్యసించినవారు సైతం ఉపాధి కోసం సాంకేతిక విద్యను ఎంచుకుంటున్నారు. అందులో భాగంగా వెల్డింగ్, గ్యాస్ కటింగ్‌లపై శ్రద్ధ చూపిస్తున్నారు. వెల్డింగ్‌లో సెర్టిఫైడ్ కోర్సులను అభ్యసించి ఇండియాలో స్టీల్‌ప్లాంట్, ఇతర ప్రాజెక్టుల్లో పాటు విదేశాల్లో సైతం ఉద్యోగాలకు ఎంపికవుతున్నారు. అలాంటి వారిని ప్రోత్సహించడంలో విశాఖ, శ్రీకాకుళం, ఇచ్ఛాపురం, పూండి ప్రాంతాల్లోని వెల్డింగ్ శిక్షణ కేంద్రాలు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నాయి. ఆరు నెలలు, ఏడాది పాటు శిక్షణ పొందితే చాలు ఏ సంస్థ అయినా వెల్డర్‌గా పనిలోకి తీసుకుంటుంది. ఇది నిరుద్యోగులకు వరంగా నిలుస్తోంది.

విదేశాల్లో ఉద్యోగాలు

ఉద్యోగం సాంపాదించడం కోసం వెల్డింగ్ నేర్చుకుని సింగపూర్, దుబాయ్, అబుదాబి, అమెరికా, ఆస్ట్రేలియా, పోలెండ్, రష్యా, అజర్‌బైజాన్, కత్తర్, థాయ్‌లాండ్, బ్యాంకాక్, మలేషియా వెళ్లిన యువకులు జిల్లాలో అనేక మంది ఉన్నారు. అధికంగా యువకులు విదేశాలకు వెళ్లడానికి ఆసక్తి కనబరుస్తుండడంతో వారి అవసరాలకు అనుగుణంగా వెల్డింగ్ శిక్షణ సంస్థలు వివిధ కోర్సులను అందిస్తున్నాయి. శ్రీకాకుళం జిల్లాలో దాదాపు 250 వరకు శిక్షణ సంస్థలు 3జీ, 4జీ, 6జీ, టిగ్, ఆర్క్, మిగ్ వెల్డింగ్‌లో శిక్షణ అందిస్తున్నాయి. పదో తరగతి ఉత్తీర్ణులైనవారు ఇంటర్, ఐటీఐ చేసిన వారిలో ఎక్కువ మంది వెల్డింగ్, ఫిట్టర్, సేఫ్టీ, క్యూసీ రంగంలో ఆసక్తి కనబరుచుకుని ప్రగతికి బాటలు వేసుకుంటున్నారు. ఆటోక్యాడ్ ఇతర సర్టిఫికెట్ కోర్సుల్లో శిక్షణ పొందినవారితో పాటు ఉన్నత విద్యను అభ్యసించినవారు సైతం, టెక్నికల్ ఎడ్యుకేషన్ వైపు వెళ్తుండడంతో వెల్డింగ్‌కు విశేష ఆదరణ లభిస్తోందని శిక్షణ సంస్థల నిర్వాహకులు చెబుతున్నారు.

నైపుణ్యతకు ప్రాధాన్యం



మా శిక్షణ సంస్థలో నైపుణ్యతకు ప్రాధాన్యత ఇస్తాం. విదేశాలకు వెళ్లేందుకు యువతకు సూచనలతో పాటు అక్కడ చట్టాలు, తదితర అంశాలను వివరిస్తాం. స్వయంగా అభ్యర్థులు విశాఖ, ఇచ్ఛాపురం, హైదరాబాద్ ప్రాంతాల్లో ఇంటర్వ్యూలకు హాజరై విదేశాలకు వెళ్లి వస్తున్నారు. నేను పదేళ్లు విదేశాల్లో పనిచేశాను. టిగ్, ఆర్క్, గ్యాస్ కటింగ్‌లో అనుభవం ఉంది. మా ప్రాంతంలో యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలనే ఉద్దేశంతో శిక్ష సంస్థ ఏర్పాటు చేశాం. రిజిస్ట్రేషన్ ఉన్న శిక్షణ సంస్థల్లో మాత్రమే శిక్షణ తీసుకోవాలి. మోసాలు బారిన పడకుండా చూసుకోవాలి. సబ్ ఏజెంట్లు, మోసగాళ్లను నమ్మి మోసపోకుండా చూసుకోవాలి.

– కర్ని భీమారావు, దుర్గా గణపతి వెల్డింగ్ ఇనిస్టిట్యూట్, పూండి

దేశీయంగా ప్రాధాన్యత



నేను సింగపూర్, మలేషియా, దుబాయ్, బ్యాంకాక్ తదితర దేశాల్లో ఉద్యోగం చేసి వచ్చాను. సొంతంగా శిక్షణ సంస్థ పెటుకున్నాను. దేశీయంగా వివిధ ప్రాజెక్టులు, కంపెనీల్లో నైపుణ్యత కలిగిన యువత కావాలని చాలా సంస్థలు ఎదురు చూస్తున్నాయి. ప్రధానంగా మూలపేట పోర్టు, స్టీల్ ప్లాంట్, ఎన్ఎండీసీ, తదితర కంపెనీల్లో ఉద్యోగాలు పొందేందుకు యువత ఆసక్తి కనబరుస్తున్నారు. వెల్డింగ్‌లో 3జీ, 4జీ, 6జీ, టిగ్, ఆర్క్ వెల్డింగుల్లో శిక్షణ ఇచ్చి సొంతంగా ఉపాధి అవకాశాలు కలిగేలా సూచనలు చేస్తున్నాం. సాంకేతిక విద్యలో స్కిల్ ఉంటే ఎక్కడైనా మంచి పొజిషన్ లభిస్తుంది.

– జి.వైరెడ్డి, శిక్షణ సంస్థ యజమాని, దేవునల్తాడ

కలెక్టరేట్ వద్ద డ్రైవర్ల ధర్నా నేడు



మాట్లాడుతున్న సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు అమ్మన్నాయుడు

రణస్థలం: ఉచిత బస్సు పథకం వలన ఉపాధి కోల్పోతున్న ఆటో, మ్యాక్సీ క్యాబ్ డ్రైవర్లకు రాష్ట్ర ప్రభుత్వం సంవత్సరానికి రూ.30 వేలు చెల్లించాలని కోరుతూ, గురువారం శ్రీకాకుళం కలెక్టరేట్ వద్ద చేపట్టనున్న ధర్నాను జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు సీహెచ్ అమ్మన్నాయుడు పిలుపునిచ్చారు. ఈ మేరకు రణస్థలం, కోష్ఠ, పైడిభీమవరంలో ఆటో డ్రైవర్లతో బుధవారం సమావేశం నిర్వహించారు. అనంతరం ధర్నా కరపత్రాలు ఆవిష్కరించి ప్రచారం నిర్వహించారు. ఆటో డ్రైవర్లకు పీఎఫ్, ఈఎస్ఐలతో కూడిన సంక్షేమ చట్టం చేయాలని డిమాండ్ చేశారు.

గొర్రెల కాపరిని ఆదుకోవాలి



జేడీ రాజగోపాల్‌తో మాట్లాడుతున్న సంఘ నాయకులు

రణస్థలం: మండలంలోని జేఆర్‌పురం పంచాయతీ సీతంవలసకు చెందిన గొర్రెల కాపరి పిట్ట రమణకు పూర్తిస్థాయిలో నష్ట పరిహారం చెల్లించాలని ఏపీ గొర్రెలు, మేకల పెంపకందారుల సంఘం నాయకుడు కోనంగి నందుడు, ఏపీ కౌలు రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు వెలమల రమణ, యాదవ సంఘం రాష్ట్ర నాయకుడు మద్దాడ రాజశేఖర్‌లు ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు తహసీల్దార్ సనపల కిరణ్ కుమార్, పశు సంవర్ధక శాఖ జేడీ కె.రాజగోపాల్‌రావు, ఏడీఏ బి.దుర్గారావులకు బుధవారం వినతిపత్రాలు అందజేశారు. ఇటీవల పైడిభీమవరం సమీపంలోని జాతీయ రహదారిపై గుర్తు తెలియని వాహనం ఢీకొని రమణకు చెందిన 20 గొర్రెలు మృతి చెందాయని ఆవేదన వ్యక్తం చేశారు. దీనివలన సుమారు రూ.5 లక్షల నష్టం వాటిల్లిందని పేర్కొన్నారు. ప్రభుత్వం తరుపున ఆదుకోవాలని విన్నవించుకున్నారు.

వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శుల నియామకం



ఎన్ని ధనుంజయరావు



కెల్లి జగన్నాయకులు



గుమ్మడి రాంబాబు

టెక్కలి : వైఎస్సార్ సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శులుగా జిల్లాకు చెందిన పార్టీ సీనియర్ నాయకులను నియమిస్తూ పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బుధవారం ఆదేశాలు జారీ చేశారు. శ్రీకాకుళం నియోజకవర్గానికి చెందిన ఎన్ని ధనుంజయరావు, టెక్కలి నియోజకవర్గానికి చెందిన కెల్లి జగన్నాయకులు, ఆమదాలవలస నియోజకవర్గానికి చెందిన గుమ్మడి రాంబాబులను పార్టీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శులుగా నియమించారు.

శ్రీకాకుళం (పీఎన్ కాలనీ): వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అనుబంధ విభాగాల్లో జిల్లాకు చెందిన పలువురు నాయకులను నియమిస్తూ వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బుధవారం ఆదేశాలు జారీ చేశారు. జన్ని అనిరుద్రుడు(ఎస్టీ సెల్ జనరల్ సెక్రటరీ), బందపల్లి రాకేష్(ఎస్టీ సెల్ కార్యదర్శి), హరిబంద్ జన్నీ (నిత్యానంద)(ఎస్టీ సెల్ జాయింట్ సెక్రటరీ), కొనపల సురేష్(చేనేత విభాగం సెక్రటరీ), కాలేపు శ్రీదేవి(చేనేత విభాగం జాయింట్ సెక్రటరీ), పచ్చిగుళ్ల సాయిరాం(వాణిజ్య విభాగం జాయింట్ సెక్రటరీ), కిల్లి అజయ్‌కుమార్(ఐటీ విభాగం కార్యదర్శి), అదపాక ఉమాశంకర్(ఐటీ విభాగం జాయింట్ సెక్రటరీ), బంకుపల్లి లోకనాథం శర్మ(ప్రచార విభాగం కార్యదర్శి), తమ్మినేని మురళి(ప్రచార విభాగం కార్యదర్శి), కెళ్ల రామకృష్ణ(ప్రచార విభాగం జాయింట్ సెక్రటరీ), బెండి గాంధీ(ప్రచార విభాగం జాయింట్ సెక్రటరీ), గెళ్లంకి వెంకట్రావు(గ్రీవెన్స్ విభాగం జాయింట్ సెక్రటరీ), నూక సత్యరాజ్(పంచాయతీరాజ్ విభాగం ఉపాధ్యక్షుడు), గురుబెల్లి శ్రీనివాసరావు(పంచాయతీరాజ్ విభాగం జనరల్ సెక్రటరీ), పూడి నీలాచలం (పంచాయతీరాజ్ విభాగం జాయింట్ సెక్రటరీ), వావిలాపల్లి మురళి(పంచాయతీరాజ్ విభాగం జాయింట్ సెక్రటరీ)లను నియమించారు.

సహజ వనరుల దోపిడీకే ఆపరేషన్ కగార్



లొత్తూరులో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

పలాస: దేశంలో సహజ వనరుల దోపిడీకే కేంద్ర ప్రభుత్వం ఆపరేషన్ కగార్ చేపట్టిందని సీపీఐఎంఎల్ న్యూ డెమోక్రసీ అధికార ప్రతినిధి పి.ప్రసాద్ అన్నారు. మండలంలోని లొత్తూరులో సిక్కోలు పోరాట యోధులు కుమారన్న, సీతారాముల వర్ధంతి సభను బుధవారం నిర్వహించారు. ముందుగా వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా గ్రామంలో భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం న్యూ డెమోక్రసీ జిల్లా కార్యదర్శి తాండ్రప్రకాష్ అధ్యక్షతన జరిగిన సభలో ప్రసాద్ మాట్లాడుతూ.. దేశంలో పర్యావరణాన్ని రక్షిస్తూ అడవులను కాపాడుతున్న ఆదివాసీలను ఆపరేషన్ కగార్ పేరుతో అంతమొందించడానికి కేంద్ర ప్రభుత్వం ప్రయత్నిస్తోందని ధ్వజమెత్తారు. ఈ దుర్మార్గమైన చర్యని ప్రజలు ఖండించాలని కోరారు. అడవులను, ఆదివాసీలను కాపాడటానికే కుమారన్న, సీతారాములు తుపాకులు పట్టారని, వారిని కూడా ఈ ప్రభుత్వం పొట్టన పెట్టుకుందని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం కూడా ప్రజా ఉద్యమాలను అణిచి పెట్టడానికి పూనుకుంటోందని, కనీసం రైతులకు ఎరువులు కూడా ఇచ్చుకోలేని పరిస్థితుల్లో ఉండడం విచారకరమని మండిపడ్డారు. కార్యక్రమంలో న్యూ డెమోక్రసీ జిల్లా సహాయక కార్యదర్శి వంకల మాధవరావు, పీవోడబ్ల్యూ రాష్ట్ర అధ్యక్షురాలు ఎం.లక్ష్మి, అరుణోదయ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సన్నశెట్టి రాజశేఖర్, సవలాపురం కృష్ణవేణి, గొరకల బాలకృష్ణ, మామిడి భీమారావు, జుత్తు వీరాస్వామి, పోతనపల్లి కుసుమ, బదకల ఈశ్వరమ్మ, ఎం.వినోద్, సాంర్ర రామారావు, సార జగన్, సవర బంగ్లాకుమార్, సీమాన్ తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తికి 3 నెలల జైలు శిక్ష

పలాస: కాశీబుగ్గ పట్టణానికి చెందిన మదన్‌మోహన్ పండాకు మూడు నెలల జైలు శిక్ష లేదా రూ.1000ల జరిమానా విధిస్తూ పలాస జూనియర్ సివిల్ జడ్జి యు.మాధురి బుధవారం తీర్పునిచ్చారు. ఈ విషయం కాశీబుగ్గ సీఐ పి.సూర్యనారాయణ వెల్లడించారు. 2022 మార్చి 3న జరిగిన కొట్లాట కేసులో తాళాసు మన్మథరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు అప్పటి హెచ్‌సీ బి.డిల్లేశ్వరరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఈ కేసులో పబ్లిక్ ప్రాసిక్యూటర్ పి.రమేష్ వాదనలు వినిపించారు. కేసులో నేరం రుజువు కావడంతో ఈ తీర్పు ఇచ్చారని పేర్కొన్నారు.

మర్యాదపూర్వక భేటీ



తాడేపల్లిలోని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కేంద్ర కార్యాలయంలో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ఆమదాలవలస నియోజకవర్గ సమన్వయకర్త చింతాడ రవికుమార్ బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా రానున్న ఎన్నికల్లో పార్టీ విజయానికి సమష్టి కృషితో ముందుకు సాగాలని జగన్‌మోహన్‌రెడ్డి సూచించినట్లు రవికుమార్ పేర్కొన్నారు.

– ఆమదాలవలస

28 పశువులు పట్టివేత

రణస్థలం: లావేరు మండలంలోని ఎన్‌హెచ్-16పై సుభద్రాపురం జంక్షన్‌లో శ్రీకాకుళం వైపు నుంచి విశాఖపట్నం వెళ్తున్న రెండు ఐసర్ వ్యాన్‌లలో తరలిస్తున్న 28 పశువులను(గేదెలను) లావేరు పోలీసులు పట్టుకున్నారు. దీనిపై లావేరు ఎస్ఐ జి.లక్ష్మణరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

ఇద్దరిపై కేసు నమోదు

కొత్తూరు : నివగాం గ్రామానికి చెందిన బి.కమల హాసన్, బి.రాజేష్‌లు వెలుగు కార్యాలయంలోకి వచ్చి విధులకు ఆటంకం కలిగించడంతో పాటు అనుమతి లేకుండా వీడియోలు చిత్రీకరించారని ఏపీఎం లలిత పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఇద్దరిపైనా కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ ఎండీ అమీర్ ఆలీ బుధవారం తెలిపారు.

గోతిలో దిగబడిన టిప్పర్

- వాహనాల రాకపోకలకు అంతరాయం



సుందరాడ వద్ద దిగబడిపోయిన ఇసుక టిప్పర్

మెళియాపుట్టి: మెళియాపుట్టి నుంచి పాతపట్నం వెళ్లే ఆల్ ఆంధ్రా రహదారిలో రోడ్డుకి అడ్డంగా టిప్పర్ లారీ దిగబడిపోయింది. పాతపట్నం నుంచి మెళియాపుట్టి వైపు ఇసుక లోడుతో వెళ్తున్న టిప్పర్ లారీ సుందరాడ వచ్చేసరికి, ఇటీవల కురిసిన వర్షాలకు జలజీవన్ మిషన్ పైప్‌లైన్ల కోసం తవ్విన గోతుల్లో నీరుచేరడంతో చక్రాలు దిగిపోయి కూరుకుపోయింది. దీంతో రాత్రి 7 గంటల వరకు రాకపోకలు నిలిచిపోయాయి. ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. రెండు జేసీబీలు లారీని బయటికి తీయడానికి విశ్వప్రయత్నాలు చేసినా ఫలితం రాలేదు. మరలా ఇసుకంతా వేరే వాహనానికి తరలించి లారీని బయటకు తీశారు. అనంతరం వాహనాల రాకపోకలు పునరుద్ధరించారు.

ప్రభుత్వ బడులను విస్మరిస్తున్నారు



పాఠశాలను పరిశీలిస్తున్న మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి

- మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి ధ్వజం
- మురికింటిభద్ర పాఠశాల పరిశీలన

మెళియాపుట్టి: కూటమి ప్రభుత్వం ప్రభుత్వ బడులను విస్మరిస్తోందని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర క్రమశిక్షణ కమిటీ సభ్యురాలు, పాతపట్నం మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి ధ్వజమెత్తారు. మండలంలోని మర్రిపాడు.కె పంచాయతీ పరిధి మురికింటిభద్ర గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను బుధవారం ఆమె పరిశీలించారు. ఇటీవల ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షాలకు పాఠశాల భవనం స్లాబ్ ఊడిపడి, తరగతి గదిలోకి వర్షపు నీరు చేరింది. దీంతో అక్కడి పరిస్థితిని చూసి ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. పాఠశాల పరిస్థితి చూస్తుంటే విద్యకు కూటమి ప్రభుత్వం ఇచ్చే ప్రాధాన్యత తెలుస్తోందని ఎద్దేవా చేశారు. వర్షం పడితే విద్యార్థులు అవస్థలు పడుతున్నారన్నారు. వైఎస్సార్‌సీపీ హయాంలో ప్రభుత్వ విద్యకు పెద్దపీట వేశామని, కూటమి ప్రభుత్వం పాఠశాలలు, విద్యార్థులపై అవలంభిస్తున్న విధానాలు మార్చుకోవాలని సూచించారు. పాఠశాలలో ఇంత సమస్య ఉన్నా అధికారులు సైతం నిమ్మకునీరెత్తనట్లు వ్యవహరిస్తుండడం బాధాకరమన్నారు. విద్యార్థులతో ముచ్చటించి, వారి సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లనున్నట్లు తెలిపారు. అనంతరం గ్రామంలోని వృద్ధులతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ ఆదినాయుడు, మండల కన్వీనర్ పోలాకి జయమునిరావు, సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి లండ వెంకటరావు, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు బమ్మిడి ఖగేశ్వరరావు, ఉర్లాన బాలరాజు, అలికాన మాధవరావు, పైల హరి, పల్లి యోగి, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

యూరియా వెతలు..!



బూర్జ మండలంలోని బూర్జ, గుత్తావల్లి, పాలవలస, ఏపీపేట గ్రామ రైతు సేవా కేంద్రాల ఆవరణలో ఎరువుల టోకెన్ల కోసం రైతులు గంటలు కొద్దీ నిరీక్షిస్తున్నారు. బుధవారం రైతులకు టోకెన్లు అందజేసి గురువారం ఎరువుల అందజేస్తారనే సమాచారంతో రైతులు క్యూలో నిల్చొని టోకెన్లు అందుకున్నారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయశాఖ ఏవో డి.ఉషారాణి మాట్లాడుతూ రైతులు ఎరువుల కోసం అధైర్యపడవద్దని సూచించారు. అందరికీ విడతల వారీగా ఎరువులు అందజేస్తామన్నారు. వ్యవసాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

– బూర్జ